## క్లుప్తంగా

### ముస్లింల సంక్షేమానికి కృషి చేయాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా రెండో విడత బాధ్యతలు స్వీకరించిన షేక్ ఆసీఫ్‌కు శుక్రవారం ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అభినందనలు తెలిపారు. లబ్బీపేటలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఆసీఫ్‌ను కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘ ప్రధాన కార్యదర్శి హాఫిజ్ షేక్ సాజిద్ అలీ, షేక్ ఇమ్రాన్, పశ్చిమ నియోజకవర్గ ప్రతినిధి షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

### రామలింగేశ్వరస్వామికి డ్రైఫ్రూట్స్‌తో అర్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శ్రీ ఉభయరామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో శుక్రవారం కార్తిక మాసోత్సవాలలో భాగంగా స్వామి వారికి విశేషంగా డ్రైఫ్రూట్స్‌తో అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు పి.సుబ్రహ్మణ్యం స్వామివారికి ప్రీతికరమైన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, పలు రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి దీపారాధనలు చేశారు.

### ప్రేమ పేరుతో యువతికి వేధింపులు

**యువతి తల్లిదండ్రులపై దాడి**

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రేమ పేరుతో యువతిని వేధించడమే కాకుండా ఆమెతో తన పెళ్లి జరిపించాలంటూ ఆ యువతి తల్లిదండ్రులపైనే ఓ యువకుడు దాడికి పాల్పడిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం దావు బుచ్చయ్య కాలనీకి చెందిన కుప్పిలి వంశీ(22) టైల్స్ పనులు చేస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన యువతి(19)ని గత కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడు. అతని చేష్టలకు భయపడిన తల్లిదండ్రులు తమ కుమార్తెను రెండు నెలల క్రితం విజయనగరంలోని వాళ్ల అమ్మమ్మ ఇంటికి పంపారు. దీంతో గురువారం రాత్రి వంశీ ఆ యువతి తల్లిదండ్రుల ఇంటికి వచ్చి మీ కూతురిని నాకు ఇచ్చి పెళ్లిచేస్తారా లేదా అంటూ రాద్ధాంతం చేసి వారిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో గాయాలపాలైన తల్లిదండ్రులిద్దరూ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

### అల్లూరి వంతెన మీదుగా సిటీ బస్సులు నడపాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్):27వ డివిజన్ దుర్గాపురం, రోకళ్ళపాలెం అల్లూరి సీతారామరాజు వంతెన మీదుగా సిటీ బస్సు నడపాలని శుక్రవారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద, పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు అధికంగా నివసించే గులాబీ తోట, దుర్గాపురం, భానునగర్ తదితర ప్రాంతాల వాసులు సిటీ బస్సు సౌకర్యం లేకపోవటం వల్ల అధిక చార్జీలు చెల్లించి ఆటోలను ఆశ్రయిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి కొత్త వంతెన మీదుగా రాకపోకలు సాగించే 11వ నంబరు సిటీ బస్సును అల్లూరి సీతారామరాజు వంతెన మీదుగా కనీసం ఒక్క సర్వీసు అయినా నడపాలని విజ్ఞప్తి చేశారు.

### రేపు గొల్లపూడిలో ఆర్యవైశ్య కార్తిక వనసమారాధన

భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 10వ తేదీన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని పద్మావతి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య వైభవం పేరుతో కార్తిక వనసమారాధన నిర్వహించనున్నట్లు పలువురు ఆర్యవైశ్య నాయకులు తెలిపారు. వాసవి ఫౌండేషన్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించి భవానీపురంలోని హోటల్ ఆలివ్ ట్రీలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆర్యవైశ్య ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహారావు మాట్లాడుతూ ఆదివారం జరిగే ఈ వనసమారాధన వేడుకల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా వివిధ పార్టీలకు చెందిన ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఆర్యవైశ్య నాయకులు పారేపల్లి (డూండీ) రాకేష్, కొణిజేటి రమేష్, దర్శి వాసు, నూకల నాగేశ్వరరావు, జాలాది వెంకటేశ్వరరావు, బొగ్గవరపు సత్యనారాయణ, టి.శ్రీనివాస్, చారుగుండ్ల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో సంక్షేమ శకం

**25వ డివిజన్ 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు**



సచివాలయంలో సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమ శకం నడుస్తోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 25 వ డివిజన్ అరండల్ పేటలోని 96 వ వార్డు సచివాలయ పరిధిలో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ చంద్రబాబు అండ్ కో వేసిన కేసుల కారణంగా నియోజకవర్గంలో 7,211 మంది పేదల ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు.

**సచివాలయ పరిధిలో రూ.12.13కోట్ల అభివృద్ధి**

96వ నంబరు సచివాలయ పరిధిలో 1,270 కుటుంబాలకు గానూ 2,945 మంది జనాభా ఉన్నారని, వీరికి డీబీటీ ద్వారా 9 కోట్ల 40 లక్షల 15 వేల 963 రూపాయల లబ్ధి చేకూరిందన్నారు. నాన్ డీబీటీ ద్వారా 2 కోట్ల 73 లక్షల 63 వేల 137 రూపాయల మేలు చేకూర్చడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వంలో నాలుగున్నరేళ్ల కాలంలో ఒక్క సచివాలయం పరిధిలోనే మొత్తం రూ.12.13 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బంకా తేజ, ఎండీ రఫీ, బంకా వెంకటేష్, నాగేశ్వరరెడ్డి, మానం గంగాధర్, చినబాబు, అలీ అన్సారీ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

**సింగ్‌నగర్ 58వ డివిజన్‌లో...**

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 58వ డివిజన్ సింగ్‌నగర్ 259వ వార్డు సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం శుక్రవారం జరిగింది. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సచివాలయ కార్యాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. 259వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా రూ.9.33 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.7.82 కోట్లు మొత్తంగా సుమారు రూ.18 కోట్ల వరకూ లబ్ధి చేకూర్చినట్లు ఎమ్మెల్యే విష్ణు వెల్లడించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మోహన్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్ పాల్గొన్నారు.

**సీఎం జగన్ అంటేనే ప్రజలకు ఓ నమ్మకం**

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అంటేనే ప్రజలకు కొండంత నమ్మకమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 33వ డివిజన్ సత్యనారాయణపురంలోని 217వ వార్డు సచివాలయ పరిధిలో శుక్రవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తితో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా శివాజీ కేఫ్ సెంటర్ వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం తాడంకివారివీధిలోని వార్డు సచివాలయం వరకు ర్యాలీగా తరలివెళ్లి, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 217వ వార్డు సచివాలయ పరిధిలో డీబీటీ ద్వారా 1,807 మందికి 5 కోట్ల 44 లక్షల 67 వేల 715 రూపాయల లబ్ధి చేకూర్చగా, నాన్ డీబీటీ ద్వారా 654 మందికి 4 కోట్ల 43 లక్షల 15 వేల 625 రూపాయల మేలు జరిగిందని వెల్లడించారు. మొత్తంగా 9 కోట్ల 87 లక్షల 83 వేల 340 రూపాయల లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. ఈబీసీ నేస్తం ద్వారా సచివాలయ పరిధిలో 97 మందికి రూ.25.20 లక్షల మేర లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాస్, శనగవరపు శ్రీనివాస్, మైలవరపు రాము, కొల్లూరు రామకృష్ణ, మంగళంపల్లి చంటి, ఉప్పు రంగబాబు, బంగారి, శనగొట్టి హరిబాబు, కంభం కొండలరావు పాల్గొన్నారు.

# దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

**ఆర్జిత సేవలకు డిమాండ్**



లక్ష కుంకుమార్చనలో ఉభయదాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో శుక్రవారం భక్తుల రద్దీ కనిపించింది. కార్తికమాసం, శుక్రవారంనేపథ్యంలో తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి ఆది దంపతులను దర్శించుకున్నారు. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, శ్రీచక్ర నవార్చన, లక్ష కుంకుమార్చన, చండీహోమం, శాంతి కల్యాణోత్సవంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వారికి అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు క్యూలైన్లను పర్యవేక్షించారు. అమ్మవారి మహా నివేదన సమర్పించిన అనంతరం భక్తుల రద్దీ మరింత పెరిగింది. సాయంత్రం పంచ హారతుల సేవతో పాటు ఊంజల్ సేవ, దీపార్చన సేవలోనూ ఉభయదాతలు భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

# సీఎం జగన్ పాలనలో సంతోషంగా ప్రజలు

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు
- 36 వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 36 వ డివిజన్ 196వ వార్డు సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, డివిజన్ కార్పొరేటర్ బాలి గోవింద్, పార్టీ శ్రేణులతో కలిసి గడప గడపకు తిరిగారు. రామకోటి మైదానం నుంచి బావాజీపేట 1, 2వ లైన్లలో పాదయాత్రగా తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో 5 కోట్ల 44 లక్షల 69 వేల 769 రూపాయల సంక్షేమాన్ని డీబీటీ ద్వారా అర్హులైన వారందరికీ అందించినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ కార్యక్రమాలు తమ జీవితాలలో వెలుగులు నింపుతున్నాయని ఈ సందర్భంగా ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పులపాక కృష్ణ, రామకృష్ణ, రెడ్యాం ఆర్కే, ఆర్.భాస్కర్, యడ్ల రాంబాబు, పఠాన్ భూపతి, ఇప్పిలి శ్రీను, పప్పుల శివ, తాటి శివ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న వీఎంసీ సీతఃప్రభాకర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో రోడ్లను పరిశీలించి బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వీఎంసీ సీతః ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో శుక్రవారం ఆయన వీఎంసీ, పోలీస్, ఆర్‌అండ్‌బీ ట్రాన్స్‌పోర్ట్, నేషనల్ హైవేస్, ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా శాఖలు సమన్వయంతో నగరంలోని ప్రతి సర్కిల్లో రోడ్డు ప్రమాదాలకు గురయ్యే ప్రదేశాలు (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమయ్యే చర్యలు, వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు, పాదచారుల కోసం జీబ్రా లైన్లు, స్కూల్స్, హాస్పిటల్స్, పవిత్ర స్థలాలు ఉన్నచోట వాటిని సూచించే సైన్ బోర్డులు ఏర్పాటు చేశామని అధికారులు ఆయనకు వివరించారు. నగరంలోని ఏప ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు అవసరమో గుర్తించి, వాటిని ఏర్పాటు చేయాలని సీతః ప్రభాకర్ సూచించారు. సమావేశంలో ఏపీఎస్‌ఆర్టీసీ డెప్యూటీ మేనేజర్ ఎ.వెంకటేశ్వర రావు, ఏపీ పీటీడీ డెప్యూటీ సీటీఎం బషీర్ అహ్మద్, ఆర్‌అండ్‌బీ డీఈఈ వై.శోభా షణ్, నేషనల్ హైవే ఇంజినీర్ ఎం.వి. నాగేశ్వర రావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అబ్దుల్ సలాం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డీసీపీ జుబిన్ సైరన్ రాయ్, డీసీపీ-1 భాస్కర్ బాబు, ఏసీపీ పి.మోహన్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.నారాయణ మూర్తి, వి.శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ వి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

# క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలి



బాక్సింగ్‌లో పసిడి పతకం సాదించిన పవన్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రీడలలో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బాక్సింగ్ పోటీలలో పసిడి పతకం సాధించిన పవన్‌కుమార్ అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ఆంధ్ర లయోలా కళాశాలలో నిర్వహించిన పోటీలలో కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల బాక్సింగ్ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ సౌత్‌జోన్ పోటీలకు ఎంపికవటం అభినందనీయం అన్నారు. పవన్‌కుమార్ బాక్సింగ్ పోటీలలో పసిడి పతకం, హర్షవర్ధన్ రజత పతకం సాధించటం తమ కళాశాలకే గర్వకారణమన్నారు. కళాశాల వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు డాక్టర్ మండవ కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్ మాట్లాడుతూ పవన్‌కుమార్ చండీఘర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ పోటీలలో సత్తా చాటి కళాశాల పేరు ప్రఖ్యాతులు ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మధురంగా సాగిన గాత్ర కచేరి



కీర్తనలను ఆలపిస్తున్న సోమయాజుల విష్ణుప్రియ

విజయవాడ కల్చరల్: గాయక సార్వభౌమ సంగీత పరిషత్, సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 140 వ జయంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సంగీత కచేరీ మధురంగా సాగింది. యువ సంగీత విద్వాంసురాలు విశాఖపట్నానికి చెందిన సోమయాజుల విష్ణుప్రియ శాస్త్రీయ సంగీతానికి పెద్దపీట వేస్తూ వాగ్గేయకారులు రచించిన సంకీర్తనలు మహాగణపతిం...తో ప్రారంభించి, పార్వతీ నిను, మామవ, శరవణభవ, గురువరం తదితర కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై పెవరలి నందకుమార్, మృదంగంపై మంగళగిరి శ్రీధర్, ఘటంపై మార్తూరి హరిబాబు సహకరించారు. సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు.

**నేటి కార్యక్రమాలు:** ఆస్ట్రేలియాలో నివాసముంటున్న సంగీత విద్వాంసుడు కొరిడే సుధీర్ శర్మ గాత్ర కచేరితో ఉత్సవాలు ముగుస్తాయని కార్యదర్శి మోదుమూడి సుధాకర్ తెలిపారు.

# అసమానతలు లేని ఆంధ్రప్రదేశ్ కోసం ప్రజల్లోకి..

**ప్రజా ప్రణాళిక సమాలోచనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు**

సాక్షి, అమరావతి: అసమానతలు లేని ఆంధ్రప్రదేశ్ కోసం ప్రజా ప్రణాళికతో ప్రజల్లోకి వెళ్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బాలోత్సవ్ భవనంలో వివిధ రంగాల మేధావులు, ప్రముఖులతో ప్రజా ప్రణాళికపై శుక్రవారం సమాలోచన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం స్వతంత్రంగా విస్తరించేందుకు కృషి చేస్తామని, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులతో కలసి పని చేస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ప్రజా ప్రణాళికను మరింత పరిపుష్టం చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా చర్చా వేదికలు నిర్వహించాలని పలువురు వక్తలు కోరారు. చెన్నుపాటి వజీర్, కొండలరావు, పరిమి, వసుంధర, చలువాది మల్లికార్జునరావు తదితరులు మాట్లాడారు.

# వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి

పాయకాపురం(విజయవాడరూరల్):ప్రభుత్వం ద్వారా అందుతున్న వైద్యసేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని 61వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి వైద్య సిబ్బందికి సూచించారు. 256 వ నంబరు సచివాలయంలో శుక్రవారం పట్టణ ఆరోగ్య, పారిశుద్ధ్య, పోషకాహార కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ రమాదేవి మాట్లాడుతూ ముఖ్యంగా గర్భిణులకు అందజేయాల్సిన పోషకాహారం, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కచ్చితంగా తెలియజేయాలన్నారు. గర్భిణులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం వివరాలను తెలియజేయాలన్నారు. తొలి కానుపులో పీఎంఎవై పథకంలో అందజేస్తున్న ఆర్థిక సహాయం గురించి వివరించాలన్నారు. ఇద్దరు ఆడపిల్లలు ఉంటే ప్రభుత్వం నుంచి అందే సహాయం తెలియజేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు ప్రతి నెలా అందజేసే పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లను కోరారు. సమావేశంలో 61వ వార్డు హెల్త్ సెక్రటరీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

# జెమ్స్ అండ్ జ్యువలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం



జ్యువలరీ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కపిలవాయి విజయకుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ బులియన్ గోల్డ్ అండ్ సిల్వర్, డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో జెమ్స్ అండ్ జ్యువలరీ ఫెయిర్ శుక్రవారం ప్రారంభమైంది. యునైటెడ్ ఎగ్జిబిషన్స్ సహకారంతో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌ను బులియన్ గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన జ్యూయలరీ ఉత్పత్తిదారులు, హోల్‌సేల్ వ్యాపారులను అభినందించారు. ఇలాంటి ప్రదర్శనలతో జ్యూయలర్స్ వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉన్న చోటునే కొనుగోలు చేసుకునేందుకు ఒక సదవకాశం అని తెలిపారు. అసోసియేషన్ చీఫ్ స్టేట్ ఆర్గనైజర్ శాంతిలాల్ జైన్, జనరల్ సెక్రటరీ బొమ్మిశెట్టి శంకరరావు, కోశాధికారి అనిల్‌కుమార్, వీకే మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన



డీఆర్ఎం కార్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్న ఐసీసీ సభ్యులు నుస్రత్ మండ్రుప్కర్, మాణిక్యరావు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): భారతీయ రైల్వే లో లైంగిక వేధింపుల వ్యతిరేక విధానాల అమలుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, మహిళా ఉద్యోగులకు పోష్ చట్టం-2013 (ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్)పై అవగాహన కల్పించేలా వర్క్‌షాపులు నిర్వహించనున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్ఓ, ఐసీసీ (ఇంటర్నల్ కంప్లెయింట్స్ కమిటీ) సభ్యురాలు నుస్రత్ మండ్రుప్కర్ తెలిపారు. పోష్ చట్టం అమలై పదేళ్లు అయిన సందర్భంగా శుక్రవారం డీఆర్ఎం కార్యాలయంలో ఈ చట్టంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ 2013, సెప్టెంబర్ 9న విశాఖపట్నం, రాజస్థాన్‌లోని కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఫలితంగా పోష్ చట్టం-2013 అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని డివిజన్‌లో ప్రతి సంవత్సరం డివిజన్ ఉద్యోగులకు వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పనిచేసే ప్రదేశంలో మహిళలకు భద్రత, భరోసా కల్పించడం, వేధింపులను నివారించడం, ఐసీసీకి ఫిర్యాదులు చేయడం, పోష్ చట్టం లక్ష్యాలు, అమలుపై తదితర విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మహిళలకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ, ఐసీసీ సభ్యులు పి.మాణిక్యరావు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# కుటుంబ కథాచిత్రాల దర్శకుడు విశ్వనాథ్



దర్శకుడు విశ్వనాథ్‌కు స్వరాంజలి సమర్పిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడ కల్చరల్: కుటుంబ కథా చిత్రాల దర్శకుడు కె.విశ్వనాథ్ అని సీనియర్ గాయని మల్లాది స్వాతి అన్నారు. రాగలహరి సాంస్కృతిక సేవా సంస్థ, ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం విశ్వనాథ్ చిత్రాల స్వరాంజలి కార్యక్రమం నిర్వహించారు. మల్లాది స్వాతి మాట్లాడుతూ సంగీత, సాహిత్యాల మేళవింపు విశ్వనాథ్ చిత్రాలు అని అభివర్ణించారు. గాయకుడు సయ్యద్ ఆలీ మాట్లాడుతూ తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చిన దర్శకుడు విశ్వనాథ్ అని గుర్తుచేశారు. సాహితీవేత్త మీరా కుమార్ మాట్లాడుతూ విశ్వనాథ్ చిత్రాల పాటల్లో సాహిత్య గుబాళింపు కనిపిస్తుందని, సామాజిక చైతన్యం కలిగించిన అంశాలు ఆయన చిత్రాలలో కనిపిస్తాయన్నారు. దండు చంద్రశేఖర్, వడ్డాది కామేశ్వరి విశ్వనాథ్ నటించిన చిత్రాలలోని గీతాలను ఆలపించారు. తెలుగు కళా వాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, నేరెళ్ళ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# 11న శివకామేశ్వరీ నీలకంఠేశ్వరస్వామి కల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 11వ తేదీ కార్తిక సోమవారం మాసశివరాత్రి పురస్కరించుకుని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన శివకామేశ్వరీ నీలకంఠేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారికి ప్రీతికరమైన కార్తిక మాసం సోమవారం మాసశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 4 గంటల నుంచి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు విశేషంగా అన్నాభిషేకం, 6.30 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

### న్యూఆర్ఆర్ పేటలో వీధికుక్కల స్వైరవిహారం

**కుక్కల దాడిలో గాయపడిన నాలుగేళ్ల బాలిక**



వీధికుక్క దాడిలో గాయపడిన హన్విక

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లపై పదుల సంఖ్యలో ఉంటూ అటుగా రాకపోకలు సాగించే చిన్నారులు, పాదచారులు, ప్రయాణికుల వెంటబడి దాడులకు పాల్పడుతున్నాయి. గురువారం ఇదే విధంగా ఓ మహిళ వీధికుక్కల బారినపడగా శుక్రవారం నాలుగేళ్ల హన్విక అనే బాలికపై వీధికుక్క దాడిచేసిన ఘటన జరిగింది. ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికను కుక్క కరవడంతో ఆ బాలిక పెద్దగా కేకలు వేసింది. దీంతో స్థానికులు కుక్కను తరిమి బాలికను చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వీధికుక్కల సమస్య నుంచి తమకు విముక్తి కలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

### బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతులకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు వున్న మహిళలు ఈ కోర్సులో శిక్షణ పొందడానికి అర్హులని పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఈ నెల 15వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 98499 53533 నంబరులో సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

### రేపు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో కార్తిక మాసోత్సవాలలో భాగంగా ఆదివారం సామూహిక శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త అద్దంకి సత్యనారాయణ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివకేశవులకు ప్రీతికరమైన కార్తిక మాసంలో సత్యనారాయణస్వామి వ్రతం చేయటం విశేషం అన్నారు. ఈనెల 11వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు కార్తిక దీపోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ జరుగుతాయని తెలిపారు.

### అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పని చేసి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేయాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి సూచించారు. డివిజన్‌లోని 251వ వార్డు సచివాలయంలో శుక్రవారం సచివాలయం సిబ్బంది, వలంటీర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పథకాలు రాని వారికి అర్హతలు ఉంటే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఎవరికైనా విధి నిర్వహణలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

### సంక్షేమ బోర్డుకు సెస్ విధిగా జమ చేయాలి

**జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు చెల్లించాల్సిన ఒక శాతం సెస్ విధిగా జమ చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. సంబంధిత అధికారులతో శుక్రవారం ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ సెస్‌ను తక్షణమే జమ చేయాలన్నారు. భవన నిర్మాణ యజమానులు బోర్డుకు సెస్ సక్రమంగా చెల్లిస్తున్నారా? లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై ప్రగతి నివేదికలు ఉప కార్మిక కమిషనర్‌కు అందజేయాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ సెంట్రల్ :
9010201611
Office mail : sakshiads@gmail.com